# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 19, నవంబర్ 2025


## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి ప్రతి ఒక్క కార్మికుడు సహకరించాలి

* కాసిపేట 2 ఇంక్లైన్ ఇన్చార్జి మేనేజర్ రవిశంకర్

కాసిపేట,నవంబర్ 18, ప్రభాతవార్త

కాసిపేట టూ ఇంక్లైన్ గనిపై మంగళవారం రోజున బొగ్గు నాణ్యత వారోత్సవాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులకు బొగ్గు నాణ్యత పై మోఖిక క్విజ్ పోటీ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం ఇన్చార్జి మేనేజర్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని ఆయన సూచించారు. నాణ్యమైన ఉత్పత్తి వినియోగదారుల సంతృప్తి అని నినాదంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా సింగరేణిలో ఈ వారోత్సవాలను జరుపుకోవడం అనావైతిగా వస్తుంది. ఈ కార్యక్రమంలో అధికారులు కె.పి, దిలీప్ కుమార్, రమణాకర్, రఘు, భార్గవ్, పీట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.




# రైతులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

☆ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండి ఏం లాభం? ☆ పంట నష్టపోయిన రైతులకు రూ 20వేలు ప్రకటించాలి

☆ తేమ శాతం 22 ఉన్న పత్తి కొనుగోలు చేయాలి ☆ కపాస్ కిసాన్ యాప్ రద్దు చేయాలి ☆ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



భైంసా/ఆదిలాబాద్,నవంబర్ 18, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లాలోని భైంసా మార్కెట్, అదిలాబాదులోని నేరేడిగోండ మార్కెట్ యార్డును, ఆదిలాబాద్ మార్కెట్ ను మంగళవారం రైతు సమస్యలపై బిఆర్ఎస్ పోరుబాటలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు, కోతలు, నిబంధనలు, వర్షానికి నష్టపోయిన పంటలు వంటి సమస్యలు రైతులు వారితో చెప్పుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని అన్నారు. దళారులకు వ్యాపారస్తులకు అనుకూలంగా అనేక నిబంధనలు పెడుతూ రైతులను నిండా ముంచుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్లో 45.85 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. కాగా 27 లక్షల టన్నుల పత్తి పంట దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సీసీఐ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ల ద్వారా కేవలం 67వేల మంది రైతుల నుంచి 1.18 లక్షల టన్నుల పత్తి మాత్రమే కొనుగోలు చేసిందని ఆయన అన్నారు. తేమ శాతం పేరిట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నాటి బిఆర్ఎస్ హయాంలో 16 నుంచి 20 తేమ ఉన్నా కూడా ఇదే సీసీఐతో కొనుగోలు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నపటికీ ఇక్కడే ఎమ్మెల్యేలు ఎంపీ ఉన్నపటికీ కొనుగోలు చేయించడంలోనూ, రైతుల సమస్యలు పట్టించుకోవడలోనూ విఫలమవుతున్నారని అన్నారు. రైతుల సంతోషంగా ఉంటే తాము ఎందుకు రైతుల పక్షాన నిలబడి ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పాలన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానా రూ 20000 ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. చలికాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పత్తిలో తేమశాతం ఎక్కువగా వస్తుందని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. తేమ శాతం పేరిట కోతలు విధించి రైతులకు మరింత నష్టం తెచ్చి పెడుతున్నారని అన్నారు. తాము ఎప్పుడూ రైతులకు అండగా ఉంటామని తెలిపారు. సోయ కొనుగోల విషయంలో కూడా రైతులకు నిరాశ మిగులుతుందని పేర్కొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలని రైతులకు మేలు చేయాలని కోరారు. కపాస్ కిసాన్ యాప్ రద్దు చేయాలని రెండు ప్రభుత్వాల మెడలు వంచేదాకా బిఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా మిగతా 2లో..





## నిర్మల్ జిల్లాకు జల సంచాయ్ - జన్ భాగీదారి అవార్డు

* న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

* అవార్డు లభించడం పై సంతోషం వ్యక్తం చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, నవంబర్ 18, ప్రభాతవార్త

మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయిజన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం, కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని మిగతా 2లో..

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు పురస్కారం

ఆదిలాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త

జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ చంచాయ్ - జన్ భాగీధారీ” కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ. 2 కోట్ల నగదు మిగతా 2లో..






## మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం

నస్పూర్, నవంబర్ 18, ప్రభాతవార్త

జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) 2024వ సంవత్సరానికి గాను జాతీయ స్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంచిర్యాల మిగతా 2లో..

## నిర్మల్ జిల్లాకు జల సంచాయ్ - జన్ భాగీదారి అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్ - జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు. నిర్మల్ జిల్లాకు జల సంచాయ్ - జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు చేపట్టాలి

- ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలి

- సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేత

**లక్షెట్టిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త**

వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం మున్సిపాలిటీ కమిషనర్‌కి మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు చేపట్టి, ఉపాధి కల్పించుట గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు కనికరపు అశోక్, దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటిగా ఏర్పడక ముందు ప్రజలకు ఉపాధి హామీ పనులు ద్వారా పని ఉండేది. కొంత ఇంటి ఖర్చుల కొరకు డబ్బులు ఉండేవి. ప్రస్తుతం మున్సిపాలిటీ తర్వాత మున్సిపాలిటీలో కలిపిన గ్రామాలలో ప్రజలకు ఉపాధి హామీ పనులు లేక ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేకుండా పోయింది. ప్రజలు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వంలో దృష్టికి తీసుకెళ్లి మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీలు పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోగలరు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంధం రాజలింగు, సీఐటీయూ మండల కన్వినర్ శోభ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా తరపున జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు జాతీయస్థాయిలో మొదటి 3 స్థానాలు సాధించాయి. జల్ సంచాయి - జన్ భాగిదారి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం 5 లక్షల 20 వేల 362 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. మొదటి కేటగిరిలో మంచిర్యాల జిల్లా అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని పొందింది. కేంద్ర జలశక్తి శాఖ జాతీయ 6వ జల పురస్కారాలలో సంయుక్త విజేతలు సహా 46 విజేతలను ప్రకటించింది. ఈ పురస్కారాలను అత్యుత్తమ రాష్ట్రం, అత్యుత్తమ జిల్లా, అత్యుత్తమ గ్రామ పంచాయతీ, అత్యుత్తమ పట్టణ స్థానిక సంస్థ, అత్యుత్తమ పాఠశాల / కళాశాల, అత్యుత్తమ పరిశ్రమ, అత్యుత్తమ జల వినియోగదారు సంఘం, అత్యుత్తమ సంస్థ (పాఠశాల / కళాశాల కాకుండా) అత్యుత్తమ పౌర సంఘంతో పాటు జల రంగంలో అత్యుత్తమ వ్యక్తి అనే కేటగిరీలు ఉన్నాయి. ప్రతి పురస్కార విజేతకూ ప్రశంసపత్రం, ట్రోఫీతో పాటు కొన్ని కేటగిరీల్లో నగదు బహుమతులను అందజేశారు. జాతీయ సంపదగా పరిగణిస్తూ నీటి వనరుల్ని అభివృద్ధి చేయడం, సంరక్షించడంతో పాటు సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన విధాన ప్రణాళికను సిద్ధం చేసి, ఆయా కార్యక్రమాలను అమలు పరిచే బాధ్యతను జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కేంద్ర శాఖను ఏర్పాటు చేసి అప్పగించారు. నీటి నిర్వహణ, జల సంరక్షణల విషయంలో జాతీయ స్థాయిలో చైతన్యాన్ని పెంపొందింపచేయడానికి ప్రధాన మంత్రి మార్గదర్శకత్వంలో జల శక్తి శాఖ ఒక విస్తృత ఉద్యమాన్ని కొనసాగిస్తుంది. ఈ దృష్టి కోణానికి అనుగుణంగా, ప్రజల్లో నీటి ప్రాధాన్యం గురించి అవగాహనను పెంచడానికీ, నీటిని ఉపయోగించుకోవడంలో అత్యుత్తమ పద్ధతులను అనుసరించేలా వారిని ప్రోత్సహించడానికీ జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) జాతీయ జల పురస్కారాలను ఇవ్వడాన్ని 2018లో మొదలుపెట్టింది. 2వ, 3వ, 4వ, 5వ జాతీయ జల పురస్కారాలను వరుసగా 2019, 2020, 2022, 2023 సంవత్సరాలలో అందించారు. హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కు చెందిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2024 అక్టోబరు 23న 2024 సంవత్సర 6వ జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏ) ప్రక్రియను ప్రారంభించగా 751 దరఖాస్తులు వచ్చాయి. న్యాయ నిర్ణేతల సంఘం దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకనం పూర్తి చేశారు. ఎంపిక చేసిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలనను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)తో కలిసి కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) పూర్తి చేసింది. ఈ క్షేత్ర స్థాయి నివేదికలను ఆధారం చేసుకొని, సంయుక్త విజేతలు సహా మొత్తం 46 విజేతలను 2024 సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్, జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి, జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) కార్యదర్శి వి.ఎల్. కాంతా రావు, తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి అశోక్ కె.కె. మీనా, జల శక్తి శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



హీరాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల



పూరిగుడిసెలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

# గుడిసెలో సాగుతున్న గిరిజన విద్య

**అమలు కానీ మధ్యాహ్న భోజన పథకం - స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్**

**లింగాపూర్, నవంబర్18, ప్రభాతవార్త :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలోని హీరాపూర్ గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల పూరిగుడిసెలో కొనసాగుతున్న వింత ఘటన వెలుగులలోకి వచ్చింది. ఇట్టి విషయమై గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా కూలి పని చేస్తామని ఉదయమే లేచి పంట పొలాలకు వెళ్తామని, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకము లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాము ఇంటికి వచ్చేసరికి సాయంత్రం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, తమ పిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని, పాఠశాలకు పక్క భవనం నిర్మించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ చైర్మన్ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నేటి బాలలే రేపటి పౌరులని, పసి పిల్లలని తెలిసికూడా నిర్లక్ష్యం వహించడం శోచనీయమని, ఇట్టి విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలియజేశారు.

## 41 మొబైల్ ఫోన్‌లు అందజేత

**ఆసిఫాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకొన్న 41 మంది బాధితులకు సిఈఐఆర్ పోర్టల్లో నమోదు ద్వారా వారి మొబైల్ ఫోన్లను గుర్తించి మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో మొత్తం 979 మొబైల్ ఫోన్లు రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.44.76 లక్షల ఉన్నట్లు తెలిపారు. దొంగలించిన మొబైల్ఫోన్లను నేరస్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లను అందుకొన్న బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణాప్రతాప్, ఐటికోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటికోర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సిసి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.





## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సాహన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. ఈరోజు న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవలక్ష్మి ్మ, నాయకులు కోనేరు కోనప్ప, దివాకర్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భూక్య జాన్సన్ నాయక్, రాథోడ్ జనార్ధన్, పడకంటి రమాదేవి, విలాస్, కిరణ్ కొమురె, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో పర్యవేక్షణకు ఐటిడిఏ పల్స్

*** ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్**

ఉట్నూర్, నవంబర్ 18, ప్రభాతవార్త

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల పర్యవేక్షణకు ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్ పేర్కొన్నారు, మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ లోని పీఎంఆర్సి భవనం యందు ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల, వసతి గృహ అధికారులు,ఏటిడిలతో సమావేశంలో పర్యవేక్షణ యాప్ ఐటీడీఏ పల్స్ ను ఆవిష్కరించారు, ఆశ్రమ పాఠశాలలో అందిస్తున్న రోజువారి మెనూ వివరాలతో ఫోటో ను అప్లోడ్ చేయడం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలు మరియు ఉపాధ్యాయుల పనితీరు తరగతి గదుల బోధనా అంశాలు తెలుసుకోవచ్చు అని అన్నారు, ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు, వచ్చేవారం నుండి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని ప్రతి విద్యార్థి పై దృష్టి సారించాలని కోరారు, విద్యార్థులకు శుద్ధ జలము త్రాగుటకు అందించే విధంగా ఆరో ప్లాంట్ ద్వారా అందించాలని పనిచేయని వాటికి వెంటనే మరమ్మత్తులు చేయాలని విద్యార్థులకు అందిస్తున్న నీటి నాణ్యత తీసి రోజువారి వివరాలు అందించాలని ఆదేశిస్తూ నీటి నాణ్యతను తెలుసుకొనే టిడిఎస్ పరికరాలని ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల డీడీలు, ఆర్ సి ఓ, ఏటీడీవోలు, ఏసిఎంఓలు,జిసిడిఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీ ఏపిఓ యువరాజ్ మర్మాట్



శివుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దంపతులు

## వైభవంగా రుద్రాభిషేకం

తాండూర్, నవంబర్ 18, ప్రభాతవార్త

మండలంలోని మాదారం టౌన్ షిప్ సిఐఎస్ఎఫ్ క్యాంపు వద్ద గల శివాలయంలో మంగళవారం రుద్రాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా కోదండ రామాలయం అర్చకులు, వేద పండితులు ముద్దు అవధూత శర్మ వేదమంత్రోచ్ఛరణలతో సుబ్రహ్మణ్యం అనసూయ దంపతులచే కన్నుల పండుగ శివుడికి రుద్రాభిషేకాన్ని జరిపించారు. అనంతరం తీర్థ,ప్రసాదం అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అడెల్లి పోచమ్మను దర్శించుకుంటున్న మాజీ రాష్ట్ర డైరీ చైర్మన్

## అడెల్లి పోచమ్మను దర్శించుకున్న మాజీ రాష్ట్ర డైరీ చైర్మన్

సారంగాపూర్, నవంబర్18, ప్రభాతవార్త

మండలంలోని నూతన అడెల్లి పోచమ్మ దేవాలయంను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానాయకులు, మాజీ రాష్ట్ర డైరి చైర్మన్ లోక భూమారెడ్డి దర్శించు కొన్నారు. నూతన విగ్రహనికి పూజలు చేసినారు.పూజారులు అతనికి తీర్థప్రసాదలుఇవ్వడం జరిగింది. అయన మాట్లాడు పడి పంటలు, పిల్లలు,పెద్దలు సుఖ సంతోషాలతో ఉండాలని. అమ్మవారి ఆశీర్వాదం ఆదిలాబాద్ ప్రజలందరిపై చల్లటి చూపు ఉండుంది అని అన్నారు. అనంతరం మొక్కులు తీర్చు కున్నారు. అయనను అడెల్లి ఆలయ చైర్మన్ సింగం భోజ గౌడ్ లోక భూమారెడ్డిని శాలువాతో సన్మానం చేసినారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్,అయిర నారాయణ రెడ్డి,మాజీ ఆలయ చైర్మన్,ఉట్ల రాజేశ్వర్, అడెల్లి మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రావు, ఆలయ డైరెక్టర్ లు,మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ ఆదిలాబాద్ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఆహ్వానం పలికిన బీఆర్ఎస్ నాయకులు

సారంగాపూర్, నవంబర్ 18,ప్రభాతవార్త:

రాష్ట్ర బిఆర్ఎస్ కార్యనిర్వాక అధ్యక్షులు మాజీ మంత్రి కేటీఆర్ రైతు సమస్యలపై పోరాటం కొరకు మంగళవారం అదిలాబాద్, భైంసా రావడం జరిగింది. నిర్మల్ జిల్లా బి ఆర్ఎస్ నాయకులు, సారంగాపూర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవి శంకర్ గంజాల టోల్ ప్లాజా దగ్గర పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మూజీ మంత్రి కేటిఆర్ కార్యకర్తలతో మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని అన్నారు. అనంతరం బోథ్‌కు ప్రయాణం అయ్యారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ సారంగాపూర్ మండలాల బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కేటిఆర్ఎస్ ఆహ్వానం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు



పదోన్నతి కాపీలను అందజేస్తున్న జీఎం రాధాకృష్ణ

## జిఎం కార్యాలయంలో పదోన్నతి ఆర్డర్ల పంపిణీ

మందమర్రి, నవంబర్18, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు బదిలీ వర్కర్ ఉద్యోగులకు జనరల్ అసిస్టెంట్ పదోన్నతి ఆఫీస్ ఆర్డర్లను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, ఉద్యోగులు ఇదే నిబద్ధతతో, పనిపట్ల కట్టుబాటుతో పని చేసి సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో తమ వంతు పాత్ర పోషించాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జి. లలిత్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఎస్కే ఏజెంట్ ఎండి. ఖాదిర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ పిట్ సెక్రటరీ గీతిక తదితరులు పాల్గొన్నారు.



## చదువు ఒక్కటే విద్యార్థుల జీవితాలలో వెలుగును నింపుతుంది

లక్షెట్టిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త

యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే జామెంట్రీ బాక్స్ అందించిన ఫౌండేషన్ వారిని అభినందించారు..ఈ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ ఇన్చార్జి బియ్యాల దినేష్ మాట్లాడుతూ... చదువనేది ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యం. చదువు మన జీవితంలో వెలుగును నింపుతుంది. చదువు పేదరికం పరిష్కరిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలి వారికి మా వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో జామెంట్రీ బాక్స్ అందించడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆర్‌టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, గడ్డం మహేష్, తోట రవీందర్, వంశీ, సాయి, వాసు, ఫౌండేషన్ ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## హలో ఆదివాసి ఛలో ఉట్నూర్

బెజ్జూర్,నవంబర్ 18,ప్రభాతవార్త :

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో మంగళవారం ఆదివాసీ నాయకులు ఆదివాసుల ధర్మ యుద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలనే డిమాండ్తో ఈనెల 23వ తేదీన ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ గ్రౌండ్లో ధర్మ యుద్ధం పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ బహిరంగ సభను 9 తెగల ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.మండలంలోని ఆదివాసులు పెద్ద ఎత్తున ఈ మహాసభకు వచ్చి విజయవంతం చేయాలని ఆదివాసి సంఘం మండల అధ్యక్షుడు కోరితే తిరుపతి కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం గౌరవ అధ్యక్షుడు సకారాం,వ్యవస్థాపక అధ్యక్షుడు ఓం ప్రకాష్,సర్మేడి కొడిపే శంకర్,కొలవార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్కయ్య,కోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజారాం,ఆదివాసి మహిళా అధ్యక్షురాలు అమృత,ఇతర ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

## కుంగ్ ఫు రాష్ట్ర స్థాయి పోటీలలో ఆణిముత్యాల ప్రతిభ

**- పట్టణ ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతులు**

మందమర్రి, నవంబర్ 18, ప్రభాతవార్త



బహుమతులు గెలుచుకున్న చిన్నారులతో ఎస్సై

మందమర్రి పట్టణానికి చెందిన చిన్నారులు కుంగ్ ఫు అండ్ కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. సీనియర్ జర్నలిస్టు స్వర్గీయ మునీర్ జ్ఞాపకార్థం మంచిర్యాల నస్పూర్‌లో నిర్వహించిన ఫిఫ్త్ తెలంగాణ కుంగ్ ఫు అండ్ కరాటే పోటీలలో మందమర్రి పట్టణానికి చెందిన విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారని మాస్టర్ జెట్టి కృష్ణ తెలిపారు. మందమర్రి పట్టణ సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి పట్టణ ఎస్ఐ రాజశేఖర్ చేతుల మీదగా బహుమతులను అందజేసారు. అనంతరం ఎస్ఐ చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని చిన్న వయసు నుండే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనం తరం మాస్టర్ జెట్టి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కుంఫు పోటీలలో బహుమతులు దక్కించుకున్న వారు. ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహా, మనోవర్ధన్, శ్రీకృతి, నయన్ తేజ్, అన్మిష, వినీత్ నందన్, త్రుతీయ బహుమతి వచ్చినవారు. శ్రీ హర్షిత్, అవినాష్, ఉదయ్ కిరణ్, శ్రీ హర్ష, ధ్రువం తేజ్, హర్షిత్ తృతీయ బహుమతి జశ్విత, విజ్ఞాన శ్రీ, వర్షిత్ పవన్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

# తల్లితండ్రుల పోషణ మన బాధ్యత



**ఆసిఫాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:**

వయోవృద్ధులు, తల్లితండ్రుల పోషణ, సంక్షేమం పిల్లల బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్ ల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధులు తల్లితండ్రుల పోషణ, సంక్షేమ చట్టం 2007పై ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన, అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్.పి. కాంతిలాల్ పాటిల్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ, జూనియర్ సివిల్ జడ్జ డి.కె. రాణి, జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఎఎస్పి చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ మొదటగా మనలో మార్పు వస్తే ఇతరులలో మార్పు తీసుకురావచ్చని, తల్లితండ్రుల పట్ల, పెద్దలపట్ల గౌరవభావం కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం మత్తుపదార్థాలకు బానిసలై క్షణికావేశంలో నేరాలు చేస్తున్నారని, ఆస్తుల కోసం కన్నవారికి, తోడబుట్టిన వారికి హాని చేస్తున్నారని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ కొరకు ఉన్న చట్టాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని, వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తల్లితండ్రులను సరిగా పోషించని కుమారులు, కూతుర్లపై 28 కేసులు నమోదు చేసి వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని, అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్ లో ఆర్డిఓ, కాగజ్ నగర్ డివిజన్ లో సబ్ కలెక్టర్ స్థాయి వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 ప్రకారం ట్రిబ్యునల్లు పనిచేస్తున్నాయని తెలిపారు. వయోవృద్ధులు తమ కుమారులు, కుమార్తెలు ఆస్తులు తీసుకుని వారి పోషణ, సంరక్షణ గురించి పట్టించుకోనట్లయితే రాజస్వ మండల అధికారి, సబ్ కలెక్టర్ కార్యాలయాలలో సంప్రదించి న్యాయం పొందవచ్చని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరాదరణకు గురైన వయోవృద్ధులు టోల్ ఫ్రీ నం.14567 లో సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం మత్తుపదార్థాల నివారణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007 సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని వందేమాతరం గీతం ఆలపించి జనగణమన గీతాలాపనతో ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా అధికారులు, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, పోలీస్ అధికారులు, వయోవృద్ధులు, ఉద్యోగులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ వాసాల ప్రభాకర్

## డిజిటల్ లెర్నింగ్‌పై ఒక్కరోజు శిక్షణ

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 18, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో మంగళవారం డివిజన్‌కు చెందిన ఇంగ్లిష్,సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల కోసం ఏ బుక్‌ఆన్ డిజిటల్ లర్నింగ్ ఒకరోజు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ నిర్వహించారు. శిక్షణకు డివిజన్‌లోని మొత్తం 140 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డీసిఈబి సెక్రటరి, పీజిహెచ్‌ఎం హనుమంతరావు,జిల్లా సైన్స్ ఆఫీసర్,కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ కటుకం మధుకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్స్ వివరిస్తున్న అంశాలను శ్రద్ధగా అర్థం చేసుకుని పాఠశాల స్థాయిలో అమలు చేస్తే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెంపొందుతాయి అని సూచించారు. డిజిటల్ లెర్నింగ్ ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎంతో కీలకమని,ఉపాధ్యాయులు డిజిటల్ సాధనాలను మరింతగా వినియోగించి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి అన్నారు. అనంతరం కోర్సు డైరెక్టర్,మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు నేర్చుకున్న జ్ఞానం,నైపుణ్యాల్ని పాఠశాలల్లో అమలు చేస్తే విద్యార్థులలో డిజిటల్ లర్నింగ్స్ వలన అనేక నూతన విషయాలను చాలా సులభంగా తక్కువ సమయంలో అవగాహన చేసుకుంటారని తెలిపారు. పాఠశాలకు సరఫరా చేయబడిన వివిధ డిజిటల్ పరికరాలను ఉపయోగించుకొని బోధన చేయాలి అని దాని ద్వారా పాఠశాలలు పాఠశాల విద్య మరింత బలోపేతం అవుతుదన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిజిటల్ రిసోర్స్ పర్సన్‌లు డి.తులసిరాం,ఉశన్న,రాజు,విజయేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మీ-చంద్రయ్య మెమోరియల్ సర్విస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి మొత్తం 28 మంది హాజరుకాగా,వారిలో 9 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వృద్ధులు అధైర్యపడవద్దని, లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా శస్త్రచికిత్సలు అందిస్తామని డా. కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్,ఐ క్యాంప్ ఇన్‌చార్జ్ గోపి పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

**బజార్ హత్నూర్, నవంబర్ 18, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో నవంబర్ 09 న జరిగిన రోడ్డు ప్రమాదంలో చెవుల రత్నమాల చనిపోవడంతో ఆ కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మృతురాలు రత్న మాలకు నలుగురు సంతానం. కూతురు వివాహం కాగా పెద్ద కుమారుడు రాములు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. రెండవ కుమారుడు లక్ష్మణ్ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ చదువుకుంటున్నారు. ఇప్పుడు కాలు విరిగి మంచాన పడ్డాడు. మూడవ కుమారుడు గణేష్ స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. కన్న తల్లి లేని ఆ ఇల్లు బోసిపోయింది. తల్లి చనిపోయి, తండ్రి తాత ఆరోగ్యం నిలకడగా లేక వారు సతమతమవుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం అన్ని తానై కుటుంబం బరువు తన భుజాలపై వేసుకొని ముందుకు సాగే క్రమంలో ఇలా జరగడాన్ని, ఆ కుటుంబం బాధతో కన్నీటి పర్యంత మవుతున్నారు. మనం ఎంత బాధపడ్డా, నాలుగు కన్నీటి చుక్కలు కార్చిన, ఆ కుటుంబానికి, ఆ పిల్లలకు అమ్మను తేలేము కానీ, ఎవరైనా మహానుభావులు ఆ కుటుంబానికి ఆపన్న హస్తం అందిస్తారని గ్రామస్తులు, కుటుంబీకుల కోరిక.



## సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జైపూర్, నవంబర్ 18, ప్రభాతవార్త**



సింగరేణిలో పని చేస్తున్న గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దారావత్ పంతుల డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ ఆంగోత్ భాస్కర్ రావుతో కలిసి సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రుని మర్యాదపూర్వకంగా కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించాలంటూ సంఘం తరఫున వినతిపత్రం సమర్పించారు. డైరెక్టర్ గౌతమ్ పోట్రు త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమం దిశగా సంఘం చేస్తున్న కృషికి ఈ సమావేశం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. సింగరేణి మెయిన్ హాస్పిటల్‌లో సింగరేణి సిఎంఓ కిరణ్ రాజ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

## ఘనంగా ఫ్రెషర్స్ డే

**ఉట్నూర్,నవంబర్ 18, ప్రభాతవార్త**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉట్నూరులో మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ ధనరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది కి గురి కాకుండా ప్రశాంతంగా చదువుకొని కళాశాల పేరు తో పాటు తల్లీ తండ్రుల పేరు కూడా సమాజంలో మొగేలా తెచ్చుకోవాలన్నారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, లక్ష్మణ్, తిరుపతి, సుజాత, దత్తు, అశ్విన్ చౌహాన్, సుధాకర్,విష్ణు, మల్లేశం, ప్రకాష్,సాయి కృష్ణ, అజీజ్ ఖాన్, సుగంధ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి దీక్షలు

**ఆసిఫాబాద్,నవంబర్ 18,ప్రభాతవార్త :**

శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి దీక్షలను మంగళవారం జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలోని అయ్యప్పస్వాయి దేవాలయంలో 16 మంది భక్తులు మాలధారణ (దీక్షలు) స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి గణపతిపూజ, అభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పాన్ని నిర్వహించి శరణుఘోష చేయించారు. ఆనంతరం గురుస్వామి శ్యాంరావ్ ఆధ్వర్యంలో భక్తులకు సామూహిక మాలధారణ చేశారు. దీక్షా సమయంలో పాటించాల్చిన నియమ నిబంధనలను స్వాములకు వివరించారు. కార్యక్రమంలో స్వాములు పాల్గొన్నారు.

## పనులలో నాణ్యతను పాటించాలి

**ఉట్నూర్,నవంబర్ 18, ప్రభాతవార్త :**

ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ వంశీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంతోష్ జాదవ్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి రెండవ బిల్లు విడుదలకు సంబంధించిన వెరిఫికేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయా అనే విషయాన్ని ఏఈ వంశీ పరిశీలించారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్ కుమార్, గ్రామ కారోభారీ పత్తు సింగ్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ

# యువజన ఉత్సవాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త**

యువజన ఉత్సవాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా జిల్లా స్థాయిలో యువజన కళాకారులు, జానపద నృత్యం, జానపద పాటలు, ఉపన్యాస వక్తృత్వం వంటి ప్రదర్శనల ద్వారా తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా తమలోని ప్రతిభను వెలికి తీయడానికి పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తమలోని కళా నైపుణ్యాన్ని, ప్రతిభను బాహ్య ప్రపంచానికి తెలియ పరచడం కొరకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని, జిల్లా స్థాయిలో ఎంపికైన కళాకారులు రాష్ట్ర స్థాయిలో, ఆ తర్వాత జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో కళాకారులకు కొదువలేదని, జిల్లా యంత్రాంగం కళాకారులను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, యువజన సంఘాల ప్రతినిధులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవార్డులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



దుప్పట్లు పంపిణి చేస్తున్న సంఘం సభ్యులు

## శ్రీ శక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి గ్రామస్తులకు దుప్పట్ల పంపిణీ

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త :**

కొమరం భీమ్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు శ్రీ శక్తి మహిళా సంఘం ముందుకొచ్చింది. కాగజ్‌నగర్ పట్టణం మెయిన్ మార్కెట్‌కు చెందిన మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో నివసించేవారు చలి కారణంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన సంఘం సభ్యులు తమ వంతు సహాయంగా దుప్పట్లు అందజేశామని తెలిపారు. కాగజ్ నగర్ మండలంలోని రేగులగూడ, పోచంగైడా, ఊట్పల్లి గ్రామాల్లో మొత్తం 150 దుప్పట్లు పంపిణీ చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమంలో నంగునూరి నీరజా, మిట్టపల్లి పద్మావతి, మిట్టపల్లి ధనలక్ష్మి, సుంక యమున, సుంక సబిత, స్నేహ, శ్వేత, అన్నపూర్ణ, రాచర్ల పార్వతి, మిట్టపల్లి లహరిక, అరుణ, లావణ్య, పావని, ఇందిరా అరుణ, లలిత తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీ ఏపిఓకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**ఉట్నూర్, నవంబర్ 18, ప్రభాతవార్త**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంగళవారం ఐటీడీ ఏ కార్యాలయంలో ఐటీడీ ఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ను అందించిన టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయులు. టీపీటీ యఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్ రావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న విద్యా సమస్యలను పరిష్కరించి, విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోటిపిటిఎఫ్ కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వరరావు, అదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకొల జ్ఞానేశ్వర్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్య మనోజ్ కుమార్, ఉపాధ్యాయ నాయకులు: రాష్ట్ర కౌన్సిలర్ శ్యామ్ రావ్, సాగర్, రమేశ్వర్, లక్ష్మన్, నానేశ్వర్, రాజేందర్, దత్తు, కృష్ణ, సంతోష్, గణేష్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త**

కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో బీఆర్ఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన పలువురు కీలక నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో జరిగిన ఈ చేరికతో తాటిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలం మరింతగా పెరిగింది. తాజా మాజీ సర్పంచ్ సోయాం సురేష్, మాజీ వార్డ్ మెంబర్స్ కడతి శుక్రు, ఫుల్మేర్ ఫకిరా, మాడావి వత్తు, ఆరే సంఘం గౌరవాధ్యక్షులు తంగడే ఉద్ధవ్ పటేల్, బడగే ఎడ్డి పటేల్, భలేపల్లి ఉప సర్పంచ్ ఠాకూర్ బండు, వార్డ్ మెంబర్ నికోడ్ రఘునాథ్ తో పాటు మాతాజీ ట్రస్ట్‌కు చెందిన 40 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెంచుకుంటున్నారని, ప్రజాదరణ పెరుగుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేతల భారీగా చేరిక పార్టీకి శుభసూచకమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి అందరూ కలిసి పని చేయాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కౌటల మండలం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికుడిని పరామర్శించిన ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం గ్రామానికి చెందిన గీత కార్మికుడు వెంకటేష్ గౌడ్ గాయపడిన ఘటనపై ఎమ్మెల్సీ దండే విఠల్ స్పందించారు. తాటి చెట్టు ఎక్కే సమయంలో సోమవారం చోటుచేసుకున్న ప్రమాదంలో వెంకటేష్ తీవ్రగాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విఠల్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంకటేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన చికిత్సలో అన్ని విధాల సహాయం అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు గజ్జి రామయ్య, కొండ్ర జగ్గా గౌడ్, సత్యనారాయణ గౌడ్, స్థానిక గీతకార్మికుల సంఘ సభ్యులు తదితరులు ఎమ్మెల్సీతో కలిసి వెంకటేష్‌ను పరామర్శించారు.



## సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై జీఎంతో చర్చించిన ఎమ్మెల్యే హరీష్‌బాబు

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త**



జీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, రైళ్ల హాల్టింగ్ విస్తరణ వంటి కీలక అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో ముధోల్ శాసన సభ్యులు రామారావు పటేల్ కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే హరీష్ బాబు జీఎంకు సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్టేషన్ ఆధునికీకరణ, మౌలిక వసతుల మెరుగుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రస్తుతం భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్(టి) వరకు పొడిగించాలని, కాజీపేట–బల్లార్షా రూట్‌లో నడిచే బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌కు సిర్పూర్(టి)లో హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా అదనపు హాల్టింగ్ ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. ఎమ్మెల్యే చేసిన సూచనలు, విజ్ఞప్తులను జీఎం శ్రీవాస్తవ సానుకూలంగా స్వీకరించారు. ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఆదివాసుల ధర్మయుద్ధం గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

## ఆదివాసీల ధర్మ యుద్ధం... ఛలో ఉట్నూర్ పిలుపు

**పెంచికల్‌పేట్, నవంబర్ 18, ప్రభాతవార్త**

23న ఉట్నూర్‌లోని ఎంపిడిఓ గ్రౌండ్‌లో జరిగే ఆదివాసీ ధర్మయుద్ధాన్ని విజయవంతం చేయాలని కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయం చిన్నయ్య అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులతో కలిసి ఆదివాసీల ధర్మయుద్ధం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే ఆదివాసుల డిమాండ్ దశాబ్దాలుగా న్యాయపరమైన పోరాటం అని అన్నారు. నిజమైన ఆదివాసుల హక్కులు, భూస్వామ్య రక్షణ, రిజర్వేషన్లలో జరిగే అన్యాయం కోసం ఐక్యంగా నిలబడే సమయం ఇది అని అన్నారు. ఆదివాసీ 9 తెగలైన కోయ, గోండ్, నాయకోప్డ్, పర్థాన్, కొలం, అందు, తోటి, కొండారెడ్డి, చెంచు, తెగలు ఈ ధర్మయుద్ధంలో ఐక్యంగా సమకూరి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో మండల అధ్యక్షుడు ఆలం సకారం, కార్యదర్శి అశోక్ నాయకులు కొడప భుజంగరావ్, మల్లేష్, సర్దాజి, మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ రూటులో గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు

**ఆసిఫాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:**




ద్విచక్ర వాహనంపై రాంగ్ రూటులో గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తున్న ఇద్దరు వేర్వేరు వ్యక్తులపై కేసులు నమోదుచేసినట్లు ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆసిఫాబాద్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించినప్పుడు ఇద్దరు వ్యక్తులు రాష్ డ్రైవింగ్ చేస్తూ తప్పు మార్గంలో గ్యాస్ సిలిండర్‌ను మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్తూ ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని 2 మోటార్‌సైకిళ్లు, 2 వంట గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాంగ్ రూట్లో నిరక్ష్యంగా సిలిండర్లను మోటార్ సైకిల్ యొక్క పెట్రోల్ ట్యాంక్ మీద పెట్టుకొని ప్రయాణించడం వల్ల ఏ చిన్న ప్రమాదం జరిగినా దీంతో సాధారణ ప్రజలకు, ఆస్తులకు భారీ మొత్తంలో నష్టం వాటిల్లె ప్రమాదం ఉన్నట్లు వివరించారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులపై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్ హెచ్ ఓ పేర్కొన్నారు.

# బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రైతులను వేధిస్తున్నాయి

*రైతు సంక్షేమం కోసం పోరాడే పార్టీ బిఆర్ఎస్ *డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

*కేటీఆర్ ఆదిలాబాద్ సభకు తరలిన సిర్పూర్ బిఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

**కాగజ్‌నగర్, నవంబర్ 18, ప్రభాతవార్త**

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం, బిజెపి పార్టీలు కారణమని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విమర్శించారు. యూరియా సమస్యను పరిష్కరించకపోవడం, పత్తి-సోయాబీన్ పంటలను కొనుగోలు చేయడంలో నిరక్ష్యం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పత్తి, సోయా రైతులకు మద్దతుగా ఆదిలాబాద్‌లో సమావేశం నిర్వహించగా, సిర్పూర్ నియోజకవర్గం నుంచి పలువురు బిఆర్ఎస్ నాయకులు ఈ సభకు హాజరయ్యారు. రైతులపై విధిస్తున్న ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి, 12 తేమ నిబంధన మరియు కపాస్ కిసాన్ యాప్ వంటి కొత్త విధానాలను ప్రశ్నించిన డా. ప్రవీణ్ కుమార్, ఈ చర్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిరక్ష్యం వహిస్తూ ప్రజాపాలన వారోత్సవాలపై దృష్టి పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. సిసిఐ విధానాలపై రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఢిల్లీలో ధర్నాలు చేసిన గత కేసీఆర్ ప్రభుత్వాన్ని ఉటంకిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతుల తరఫున పోరాటం చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకుని కాపాడితే, రేవంత్ రెడ్డి రైతులను కన్నీరు పెట్టిస్తున్నారు" అని ఆరోపిస్తూ, బిఆర్ఎస్ రైతు సంక్షేమం కోసం పోరాడే పార్టీ అని తెలిపారు. ఎటువంటి షరతులు లేకుండా పాత విధానంలోనే పంట కొనుగోళ్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేటిఆర్ పిలుపు మేరకు రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్యాంరావు, మండల అధ్యక్షులు అంజన్న, యూత్ ప్రెసిడెంట్ రాజు, తన్నీరు పోచం, మినాజ్, సలీం, వెంకటేష్, వాసు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తప్పుడు ఆరోపణలు

ఎమ్మెల్యే, టౌన్ ప్రెసిడెంట్‌ల జోలికి వస్తే ఊరుకునేది లేదు - కాంగ్రెస్ పార్టీ నాయకుల స్పష్టీకరణ

**బెల్లంపల్లి, నవంబర్ 18, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గాన్ని బెల్లంపల్లి పట్టణాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జమ్మికుంట విజయకుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెల్లి రమేష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భూక్య రాము నాయక్, కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఖాజా పాషాలు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన బత్తుల సుదర్శన్ అప్పుడు బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయి పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన సుదర్శన్ పట్టణ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్ల వెడల్పు వంటి కార్యక్రమాలు చేస్తుండగా, జీర్ణించుకోలేని సుదర్శన్ ఎమ్మెల్యే పైనే కాకుండా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య పై అర్థరహితమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కొరకు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధి కొరకు అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్ని పార్టీలు కులాలు, మతాలకతీతంగా అభివృద్ధి కొరకు పనిచేస్తున్నారని వారు తెలిపారు. ఎవరికీ ఏ ఆపద వచ్చినా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి సహకరిస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యాల ఎమాజీ తాను న్యాయవాదినని అహంకారంతో తండ్రి వయసు ఉన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను అమర్యాదగా మాట్లాడుతూ, అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై విమర్శలు చేయడం, బురద చల్లడం అమానుషమన్నారు. అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు సహకరించాలని వారు హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో పట్టణ అధ్యక్షుడు ముచెర్ల మల్లయ్య లబ్ధిదారుని వద్ద 50 వేల డబ్బులు తీసుకుంటున్నారని మల్లయ్య తాగుబోతు అని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. చేసిన ఆరోపణల విషయంపై ఏవైనా ఆధారాలు ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రజల ముందుకు రావాలని బత్తుల సుదర్శన్, ఏమాజీకి సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ఈ విషయంలో సుదర్శన్ సోయి లేదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ బీజేపి నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ పై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య పై, కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని పరువు నష్టం దావా వేసి వారిని రోడ్డుకీడుస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు నీలి కృష్ణ, ముగురుం కన్నయ్య, కాంగ్రెస్ నాయకులు రేగుంట రాజలింగు, మేకల శ్రనివాస్, శివశంకర్, జక్కుల శ్రీధర్, అల్లం కిషన్, ఆసిఫ్, గొడుగు రఘు, శనిగల శంకర్, మీర్జా ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.






# పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలి

- ఛలో హైదరాబాద్ ను విజయవంతం చేయండి

- మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దమ్మ నారాయణ

**లక్షెట్టిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త**

పెరిగిన జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 24 శాతం రిజర్వేషన్లు పెంచాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి భవన ఆవరణలో జమాలల రణభేరి సభచ వాల్ పోస్టర్లను మాల మహానాడు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఈ నెల 23న జరిగే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలనీ, మాలల హక్కుల సాధనకై జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నమ్మన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ స్కాలర్షిప్, ఫీజు రియంబర్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాలల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలనీ, గతం సంవత్సరంలో కేటాయించి విడుదల చేయకుండా ఆపేసిన నిధుల విడుదల చేయాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాలెం చిన్నన్న, భూపెల్లి మల్లేష్, దొంత నర్సయ్య, భైరం లింగన్న, తొగరు రాజు, మినుముల శాంతి కుమార్, దొండ ప్రభాకర్, గరిసే రవీందర్, కోడి మల్లేష్, బొల్లెడ్ల విజయ్, మినుముల జనార్దన్, పెండెం సత్తయ్య, వేముల ప్రేమ్ సాగర్, మగ్గిడి సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి చర్యలు

**ఆసిఫాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:**

జిల్లాలోని కాగజ్‌నగర్ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో పలు శాఖల అధికారులతో కాగజ్ నగర్ పట్టణంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కాగజ్ నగర్ లో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 455 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యాలయానికి ప్రహరీ కూడా నిర్మాణం, బోధన, బోధనేతర సిబ్బంది, మెస్ వర్కర్ల నియామకానికి సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గురుకుల విద్యాలయానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, నిర్వహణ కమిటీ విద్యాలయ నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకల సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, విద్యాలయ ప్రిన్సిపల్ కనకవర్మ, స్టూడెంట్ కౌన్సిలర్ ఇంద్ర కుమార్, పేరెంట్స్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, సునీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే